రోడ్డును ఆక్రమించి.. ఇళ్లు, షాపుల నిర్మాణం

- ఆక్రమణల చెరలో కీసర- గండేపల్లి రోడ్డు..
- రోడ్డు కుంచించుకుపోయి ఇబ్బందులు
- వాహనదారులు, ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- ప్రమాదాలకు నిలయంగా కీసర హైవే రోడ్డు


గండేపల్లి - కీసర రోడ్డుపై ఆగిన వాహనాలు

కంచికచర్ల: నిత్యం రద్దీగా ఉండే ఆర్అండ్బీరోడ్డు ఆక్రమణకు గురయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్లన్నీ అందంగా తీర్చిదిద్దుతామన్న నాయకులు కనిపించటంలేదు. ఆక్రమణకు గురైన రోడ్డును సర్వే చేసి అక్రమకట్టడాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు వైపులా ఆక్రమణ..

మండలంలోని 65వ నంబర్ జాతీయ రహదారిలో కీసర నుంచి గండేపల్లి వెళ్లే ఆర్ అండ్బీ రోడ్డును కొందరు రెండు వైపులా ఆక్రమించారు. అక్రమంగా దుకాణాలు, ఇళ్లు నిర్మించారు. దీంతో రోడ్డు కుంచించుకు పోయింది. ఎదురెదురుగా వాహనాలు రావాలంటే ఇబ్బందులు తప్పటం లేదు. దీనికి తోడు షాపులకు వచ్చే కొనుగోలుదారులు వారి వాహనాలను రోడ్డుపై ఆపుతున్నారు.

రోడ్డు ప్రాధాన్యత ఇదీ..

తెలంగాణ రాష్ట్రంలోని పలు మండలాలకు వెళ్లే రోడ్డు కూడా.. ఈ రోడ్డు కంచికచర్ల మండలంలోని గండేపల్లి గ్రామాన్ని కలుపుకుంటూ వీరులపాడు మండలం జమ్మవరం, బోడవాడ, నందలూరు, తాటిగుమ్మి, జుజ్జూరు తదితర గ్రామాలకు వెళ్తుంది. ఇదే రోడ్డుకు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం వరకు ప్రయాణికులు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. గండేపల్లి గ్రామ సమీపంలో ప్రైవేటు కర్మాగారం ఉంది. ఇక్కడకు కార్మికులు నిత్యం వందల సంఖ్యలో బస్సులు, ఆటోలలో వచ్చి, వెళ్తుంటారు.

ఆర్ అండ్బీ రోడ్డును ఆక్రమించి అద్దెలకు..

కీసర, గండేపల్లి గ్రామాల్లో రోడ్డు మార్జిన్ స్థలాలను దర్జాగా ఆక్రమించుకుని షాపుల నిర్మాణం చేపట్టారు. వీటిని కొంతమంది అద్దెకు ఇచ్చి లబ్ధిపొందుతున్నారు. మరి కొందరు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు.

40 అడుగుల రోడ్డు ప్రస్తుతం 10 అడుగులే..

రోడ్డు ఆక్రమణకు గురవటంతో 40 అడుగుల రోడ్డు ప్రస్తుతం పది అడుగులు మాత్రమే ఉంది. దుకాణాల ఎదుట వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. గండేపల్లి సెంటినీ కర్మాగారానికి చిన్న స్థాయి వాహనాల నుంచి భారీ కంటైనర్లు నిత్యం రాకపోకలు ఇబ్బందిగా సాగిస్తుంటాయి.

హైవేపై అడ్డదిడ్డంగా..

విజయవాడ- హైద్రాబాద్ నేషనల్ హైవేపై కొంతమంది అక్రమంగా అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేశారు. రాత్రి, పగలు తేడా లేకుండా దుకాణాలు నడుపుతున్నారు. దీంతో హైవేపై వాహనదారులు తమ వాహనాలను అడ్డదిడ్డంగా రోడ్డుపై ఉంచటంతో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఏడాది గండేపల్లి రోడ్డు నుంచి పెండ్యాల రోడ్డుకు వెళ్లేందుకు బైక్పై హైవే దాటేందుకు ప్రయత్నించే సమయంలో ఓ వాహనం బైక్ను ఢీకొనగా తీవ్రగాయాలవటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరొక ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కీసరలో టోల్ప్లాజా ఏర్పాటు చేయటంతో రాత్రి, పగలు దుకాణాలు తెరిచే ఉంటున్నాయి.

భవిష్యత్ను దృష్టిలో పెట్టుకుని ఆర్అండ్బీ, జిల్లా పరిషత్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఆక్రమణకు గురైన రోడ్డును సర్వే చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



కీసర గండేపల్లి రోడ్డంతా ఆక్రమణకు గురయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది రోడ్డు మార్జిన్ను ఆక్రమించుకుని దుకాణాలు కట్టి అద్దెకు ఇస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవట్లేదు. రోడ్డుపై పలు చోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రాత్రి సమయాల్లో వాహనదారులు ఆ గోతుల్లో పడి తీవ్రగాయాల పాలవుతున్నారు.

– బొక్కా నాగేశ్వరరావు,
ఎలక్ట్రీషియన్ గండేపల్లి

క్లుప్తంగా

చంద్ర వర్ధంతి



నందిగామ రూరల్: మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో రైతు కూలీ సంఘం నాయకుడు కామ్రేడ్ చంద్ర శ్రీమన్నారాయణ 17వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీమన్నారాయణ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాల సరుకుల ధరలు, విద్యుత్ బిల్లుల పుణ్యమాని సామాన్యుని జీవనం దుర్భరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు కోట్యా నాయక్, కుటుంబ సభ్యులు, సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఊంజల సేవ




నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తిరునాళ్ల మహోత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు, విశేష పూజలు, అభిషేకాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి ఊంజల సేవ వేదోక్తంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి అమ్మవారి రథోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో నయనానందకరంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఉంచి తీన్మార్ వాయిద్యాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో నరసింహమూర్తి, వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకటలక్ష్మీ సాయిబాబు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీర జవాన్ మురళీనాయక్కు నివాళి



పెనుగంచిప్రోలు: భారత్- పాక్ యుద్ధంలో అమరుడైన శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన వీర జవాన్ మురళీ నాయక్ చిత్ర పటానికి సోమవారం స్థానిక చెరువుకట్ట బజార్లోని రావిచెట్టు వద్ద ఘన నివాళులర్పించారు. మురళీ నాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాణావతు జగ్గయ్య, ఇస్లావతు మంగపతి, స్థానిక నాయకులు గుగులోతు రమేష్, అంజి, జగదీష్, మహిళలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్- 1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. సోమవారం విద్యార్థులచే వివిధ కథల పుస్తకాలను చదివించి, చెప్పించారు. తరువాత గణిత ఉపాధ్యాయులు దాసు ఎడిషన్, సబ్ట్రాక్షన్స్, మల్టిప్లికేషన్స్, జనరల్ మ్యాథ్స్ను విద్యార్థులతో చేయించారు. విద్యార్థులకు పరుగు పందెం పోటీ నిర్వహించగా, ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వినోద్బాబు, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

కనుల పండువగా వార్షిక బ్రహ్మోత్సవాలు

నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలువురు దంపతులు పీటలపై కూర్చుని సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



షేర్మహ్మద్పేట(జగ్గయ్యపేట): గ్రామంలో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. గ్రామంలో సోమవారం ఆయన తాగునీటి బోర్లను పరిశీలించారు. మాట్లాడుతూ వేసవి కాలం కావటంతో తాగునీటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. పని చేయని పంచాయతీ తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. గ్రామంలోని చెరువు సమీపంలోని తాగునీటి బావి చుట్టూ రక్షణ చర్యలు లేకపోవటంతో నీరు కలుషితమవుతుందని చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యదర్శి నాగేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ కమలేష్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ అధిష్టానంపై అసంతృప్తి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలో మాజీ మంత్రి నెట్టెం రఘురాంకు ఆప్కాబ్ చైర్మన్ పదవి ఇవ్వకపోవడం పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ అధిష్టానంపై టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో తీవ్రమైన నిరాశ వ్యక్తమైంది. సోమవారం సాయంత్రం స్థానిక చిల్లకల్లు రోడ్లోని శుభమస్తు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. సముచిత స్థానం ఇవ్వకపోతే తమ పదవులు వదులుకుంటామని హెచ్చరించారు.

కమనీయం.. నరసింహుని కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వేదాద్రి(జగ్గయ్యపేట) : యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణం నయనానందకరంగా జరిగింది. ఆదివారం రాత్రి 12 గంటలకు నరసింహ స్వామి వారి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. మేళతాళాలతో, భక్తుల జయజయ ధ్వానాల నడుమ స్వామి వారి ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం వేద పండితులు పరాంకుశం శ్రీనివాసచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శ్రీధరాచార్యులు, మురళీధరాచార్యులు, యోగానందాచార్యులు, శేషాచార్యుల పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కృష్ణా నది ఒడ్డున ఆలయంలో భక్తుల హర్షధ్వానాల మధ్య దాదాపు మూడు గంటల పాటు కల్యాణం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పాల్గొ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి ఇందిరా దత్ ఆలయ సంప్రదాయం ప్రకారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈఓ కానూరి సురేష్బాబు పర్యవేక్షణలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణం సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసి పోయింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెల్లవారు జాము వరకు ప్రాంగణమంతా పండగు వాతావరణాన్ని తలపించింది. బాలాత్రిపుర సుందరి అమ్మవారి ట్రస్ట్, కేసీపీ, హేమాద్రి, రామ్కో సిమెంట్స్ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, ప్రసాదాలు పంపిణీ చేశారు. యోగానంద రాజ్యలక్ష్మీనరిసింహ స్వామి భజన సమాజం వేదాద్రి వారి కోలాట ప్రదర్శనలు బందావన చెక్కభజన, త్రినేత్ర ఆర్ట్స్ కల్చరల్ జగ్గయ్యపేట వారి కూచిపూడి నాట్య ప్రదర్శన, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. చిల్లకల్లు, జగ్గయ్యపేట ఎస్ఐలు తోల సూర్య శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, రాజు, వెంకటేశ్వర్లు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్ గుడారి పేరయ్య, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రజనిపై సీఐ తీరుకు నిరసన

సీఐ క్షమాపణ చెప్పాలని డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలే కాకుండా మహిళల పట్ల కూడా రెడ్బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామంలోని మక్కపేట రోడ్డులో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి విడుదల రజనిపై సీఐ తీరును ఖండిస్తూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి రజనిపై చిలుకలూరిపేట సీఐ సుబ్బారాయుడు మహిళ అని కూడా చూడకుండా అవమానించారన్నారు. కూటమి ప్రభుత్వం రెడ్బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, బీసీ నేతపై పోలీసుల తీరు బాధాకరమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు గాడి తప్పాయని పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని చట్టాలను కాపాడాల్సిన పోలీసులే మహిళల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో కనీసం ఒక్క హామీని కూడా అమలు చేయలేని నిస్సహాయ స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కొంత మంది పోలీసులు కూటమి ప్రభుత్వ నాయకులకు తొత్తులుగా మారారని విమర్శించారు. ఇప్పటికైనా సీఐ సుబ్బారాయుడు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ముందుగా వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నిసా, గ్రామ కన్వీనర్ డీ రాంబాబు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు కనగాల రమేష్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు, వేముల మల్లేశ్వరరావు, నాయకులు చల్లా సుశీల, ఇజ్రాయిల్, బుల్లయ్య, ప్రభాకర్, పృథ్వీ, రామారావు, శ్రీనివాసరావు, జగదీష్, సురేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

20న కార్మికుల దేశవ్యాప్త సమ్మె


సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు

నందిగామ రూరల్: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, జీవో నంబరు 21ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. ఈ నెల 20న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని కమ్మవారిపాలెం, రాఘవాపురం, పల్లగిరి, గోళ్లమూడి ఆటో స్టాండ్స్లో వర్కర్స్తో కలిసి సమ్మెకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన చలాన్లను తగ్గించాలని, నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఆటో, రవాణా రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సునీల్, రవి, ఇస్సాక్, గోపి, బంకా రమేష్, పుల్లయ్య, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి


వత్సవాయిలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న సీఐటీయూ మండల కమిటీ సభ్యులు

వత్సవాయి: ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మండల సీఐటీయూ కార్యదర్శి బి.రాము తెలిపారు. వత్సవాయిలో కార్మికులతో కలిసి సోమవారం కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమబోర్డు రక్షణ, లేబర్కోడ్స్ రద్దు కోసం కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ సభ్యులు షేక్ నాగులమీరా, టి.ప్రసాద్, జానీ, లాల్మియా, ముజ్ఫర్, గురవయ్య, నాగరాజు, వెంకటేశ్వర్లు, ఏసుపాదం, కాశిం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు దగ్ధం



తిరువూరు: స్థానిక సాయిరాఘవ ఎస్టేట్స్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు సోమవారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. పాఠశాలకు సెలవులు కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు లేని సమయంలో పాఠశాల ఆవరణలోని బస్సు నుంచి మంటలు రావడంతో చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. బస్సు పూర్తిగా దగ్ధమైందని పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా మహ్మద్ ఇర్ఫాన్



ఇబ్రహీంపట్నం: పీఆర్టీయూ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కాచవరం పాఠశాలలో ఉర్దూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మహ్మద్ ఇర్ఫాన్ పాషాను నియమించినట్లు పీఆర్టీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు షేక్ నవాబ్జానీ, సోలా రాఘవరాజు సోమవారం తెలిపారు. ఇర్ఫాన్ పాషా మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఇబ్రహీంపట్నం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాతినేని నాగబాబు, మహమ్మద్ బాజీనీ అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 15 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 15 అర్జీలు అందాయన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఆరు అర్జీలు, సర్వే చేయాలని కోరుతూ రెండు, పంచాయతీ రాజ్ శాఖకు రెండు, ఉద్యాన శాఖ రెండు, వైద్యారోగ్య ఒకటి, పోలీస్ ఒకటి, మున్సిపల్ శాఖకు సంబంధించి ఒక అర్జీ అందినట్లు తెలిపారు. అర్జీలను ఆయా శాఖాధికారులకు పంపి ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సుల సేవలు ప్రశంసనీయం


నర్సుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నర్సులు, వైద్యులు

నందిగామ టౌన్: ఆస్పత్రులకు వచ్చే రోగులను ఆత్మీయంగా పలుకరించటమే కాకుండా, రోగులకు నర్సులు అందించే సేవలు ప్రశంసనీయమైనవని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సోమవారు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగి ఏ పరిస్థితిలో ఉన్నా దగ్గరికి తీసుకునేది ఒక్క నర్సులు మాత్రమేనన్నారు. వైద్యుల తరువాత నర్సులకు అంతటి స్థానం ఉందని గుర్తు చేశారు. అనంతరం ఆస్పత్రి నర్సులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, వైద్యులు సీతారావమ్మ, సింధూర, అజయ్, నర్సులు సూర్యావతి, సునీత పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణంలో భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి దత్తత ఆలయమైన శ్రీధర్మపురి యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామివారు, అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అందంగా అలంకరించిన మండపంపై స్వామివారు, అమ్మవార్ల విగ్రహాలు నిలిపి ఆలయ ప్రధానార్చకులు పరాంకుశం సీతాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ వేద పండితులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ పీటలపై వంశ పారంపర్య ధర్మకర్తలు, పలువురు దంపతులు కూర్చొన్నారు. కల్యాణానికి ఆలయ ఈఓ బీహెచ్వీఎస్ఎన్ కిషోర్కుమార్ పట్టు వస్త్రాలు తీసుకువచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, వీర్ల రమణ, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అప్రమత్తంగా వ్యవహరించాలి

ముసునూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీఓ బీఏ సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనులపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పన్నుల వసూలు వేగవంతం చేయాలని, పారిశుధ్యం, వీధిలైట్లు, మంచినీటి సరఫరా విషయంలో ముందస్తు ప్రణాళికలతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఎడ్ల బండ లాగుడు పోటీలను సోమవారం రాత్రి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా సంప్రదాయ ఎడ్ల బండ్ల లాగుడు పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఒంగోలు జాతి పశు ప్రదర్శన పోటీలు రసవత్తరంగా సాగాయి. మొదటి రోజు రెండు పళ్ల జత విభాగంలో 11 జతలు పాల్గొన్నాయని గ్రామ రైతు కమిటీ సభ్యుడు రాధాకృష్ణ తెలిపారు. 10 నిముషాల వ్యవధిలో 7.50 క్వింటాళ్ల బరువును లాగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వడ్లమూడి శ్రీనివాసరావు, అత్తలూరి వెంకట్రావ్, దిగుమర్తి రాంబాబు, ఉమ్మినేని విక్రం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈశ్వరీ మాతకు లక్ష మల్లెలార్చన



జగ్గయ్యపేట: పట్టణంలోని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఈశ్వరీ దేవి ఆలయంలో సోమవారం వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా లక్ష మల్లెలార్చన ఘనంగా నిర్వహించారు. ఈశ్వరీ దేవి అమ్మవారికి భక్తుల సహకారంతో లక్షమల్లెలార్చనను అర్చకులు సాయిచార్యులు ఆధ్వర్యంలో కుంకుమార్చన, సహస్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.